సాక్షి
వికారాబాద్
ఆదివారం । 28 । సెప్టెంబర్ । 2025

వర్ష బీభత్సం

జిల్లా వ్యాప్తంగా స్తంభించిన జనజీవనం


బంట్వారం: నూరుల్లాపూర్‌లో నీట మునిగిన పత్తి పంట


తాండూరు రూరల్: వాగులో చిక్కుకున్న లారీ డ్రైవర్లను సురక్షితంగా బయటకు తెచ్చిన ఎస్డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు

- పంట పొలాలను ముంచెత్తిన వరద
- భారీగా నష్టపోయిన అన్నదాతలు
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఎక్కడికక్కడ నిలిచిన రాకపోకలు
- మృత్యువాత పడ్డ మూగజీవాలు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లాను వర్షాలు ముంచెత్తుతున్నాయి. విరామం లేని వానలతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోతోంది. గురువారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు వరుణుడు తన ప్రతాపాన్ని చూపాడు. దీంతో వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లాయి. పంట పొలాల్లోకి వరద నీరు పోటెత్తింది. అన్నదాతలకు భారీ నష్టం చేకూరింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పలు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. జిల్లాలోని కాగ్నా, మూసీ నదులు ఉగ్రరూపం దాల్చాయి. ధారూరు మండలం కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు నీటి ప్రవాహంలో నాలుగు గేదెలు, నాలుగు దూడలు కొట్టుకుపోయాయి. అర్ధరాత్రి పొలాన్ని వరద ముంచెత్తడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. దాదాపు 600మీటర్ల మేర ప్రవాహం చొచ్చుకొచ్చింది. పొలంలోని ఇంటి వద్దకు నీరు చేరడంతో రైతు కుటుంబం అప్రమత్తమై ప్రాణాలను కాపాడుకుంది. ఇదే మండలంలోని కేరెళ్లి సొసైటీ భవనం వెనుకవైపు గోడ కూలిపోయింది. పక్కనే ఉన్న అంగన్‌వాడీ భవనంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మండలంలో 30 విద్యుత్ స్తంభాలు, పొలాల్లోని నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. తాండూరు మండలం జట్టూరు వాగులో సిమెంట్ లారీ చిక్కుకుంది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ముజావీర్, జార్ఖండ్‌కు చెందిన బుద్ధిరామ్ లారీలో ఉండిపోయారు. మహబూబ్‌నగర్‌కు చెందిన ఎస్డీఆర్‌ఎఫ్ బృందం పడవలో వెళ్లి వారిని కాపాడారు. మర్పల్లి మండలం సిరిపురం గ్రామంలో వృద్ధురాలి అంత్యక్రియలకు కుటుంబ సభ్యులు, స్థానికులు పడరాని పాట్లు పడాల్సి వచ్చింది. శుక్రవారం రాత్రి బంట్వారం మండలం కొత్తపల్లి చెరువు అలుగు ఉధృతిలో కొట్టుకుపోయిన రవికుమార్ మృతదేహం శనివారం బయటపడింది.


బంట్వారం: రవికుమార్ మృతదేహాన్ని బయటికి తీస్తున్న స్థానికులు


ధారూరు: కేరెళ్ల గ్రామంలో కూలిన సొసైటీ భవనం


మర్పల్లి: రావులపల్లిలో నేలమట్టమైన పసుపు పంట


తాండూరు రూరల్: గౌతాపూర్‌లో నీట మునిగిన విద్యుత్ సబ్‌స్టేషన్

న్యూస్‌రీల్

సహాయక చర్యలు చేపట్టండి

స్పీకర్ ప్రసాద్‌కుమార్



అనంతగిరి: భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండటంతోపాటు అవసరమైన చర్యలను తీసుకోవాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ సూచించారు. శనివారం కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు ఫోన్ చేసి క్షేత్రస్థాయి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన అన్ని సహాయక చర్యలు తీసుకోవాలని, మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా చూడాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగా లని సూచించారు. ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఉధృతంగా ప్రవహించే వాగు లు,వంకలు, కాలువలు దాటరాదని తెలిపారు. అత్యవసరం అయితే తప్ప ప్రయాణాలు చేయవద్దన్నారు.

కేటీఆర్‌ను కలిసిన కృష్ణ


కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కృష్ణ

దుద్యాల్: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మండల వాసి, ఉమ్మడి మహబూబ్ నగర్ జెడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు ముదిగిండ్ల కృష్ణ శనివారం తెలంగాణ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కొడంగల్ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు అవకాశాల గురించి కేటీఆర్ ఆరా తీసినట్లు తెలిపారు. బీసీ గళాన్ని ముందుకు తీసుకెళ్లి స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని సూచించినట్లు తెలిపారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో ఉస్మాన్, సురేశ్ గౌడ్, బాలగౌడ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

- యువత ఆయన బాటలో నడవాలి
- అడిషనల్ కలెక్టర్ సుధీర్


నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్ ఇతర అధికారులు

అనంతగిరి: స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ తొలిదశ ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ సుధీర్ అన్నారు. శనివారం వికారాబాద్‌లోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటం కీలక పాత్ర పోషించారని కొనియాడారు. తన మంత్రి పదవిని తృణప్రాయంగా వదిలేసిన మహనీడన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీఆర్‌ఓ మంగీలాల్, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి మాధవరెడ్డి, డీటీడీఓ కమలాకర్ రెడ్డి, మత్స్య శాఖ అధికారి వెంకయ్య, పంచాయత్ రాజ్ ఈఈ ఉమేష్ కుమార్, డీపీఆర్‌ఓ చెన్నమ్మ, శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

18 వైన్స్‌కు దరఖాస్తుల స్వీకరణ

తాండూరు: కొత్త మద్యం పాలసీ కింద వైన్స్ నిర్వహణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తాండూరు ఎక్సైజ్ సీఐ ఆదిశేషిరెడ్డి తెలిపారు. తాండూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని 18 షాపులు ఉండగా, ఇందులో 11 దుకాణాలను ఓపెన్ కేటగిరీ, 5 షాపులను ఎస్సీలకు, రెండు షాపులను గౌడ కులస్తులకు రిజర్వ్ చేశారన్నారు. అక్టోబర్ 18వ తేదీ వరకు అప్లికేషన్లు స్వీకరిస్తున్నామన్నారు.

రేపు ఉద్యోగ మేళా

తుక్కుగూడ: జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశం కల్పించడానికి ఈ నెల 29న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి జయశ్రీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని ఫాక్స్‌కాన్ కంపెనీలో పోస్టులు ఉన్నట్టు చెప్పారు. డిప్లొమా ఎలక్ట్రానిక్స్, మెకానిక్ ఇంజనీరింగ్ విద్యార్హత కలిగి ఉండాలన్నారు. 18 నుంచి 30 సంవత్సరాలలోపు వయస్సు ఉన్నవారు అర్హులని తెలిపారు. వివరాలకు ఉపాధి కార్యాలయం, శాంతినగర్, ఐటీఐ క్యాంపస్, మల్లేపల్లి, హైదరాబాద్‌లో లేదా 90630 99306, 89771 75394 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రపంచస్థాయి నైపుణ్య శిక్షణకే ఏటీసీలు

- తాండూరు, మర్పల్లి పట్టణాల్లో సెంటర్లను ప్రారంభించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి
- విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచన


తాండూరులో ఏటీసీని ప్రారంభించి యంత్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీఎంఆర్

తాండూరు/మర్పల్లి: విద్యార్థులకు ప్రపంచ స్థాయి నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకే ప్రభుత్వం అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను అందుబాటులోకి తెచ్చిందని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం తాండూరు పట్టణ శివారులో రూ.60 కోట్లతో నిర్మించిన ఏటీసీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆరు విభాగాల్లో 172 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకో వాలని సూచించారు. గత పాలకులు తాండూరు అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. కాంగ్రెస్ వచ్చాక ఈ ప్రాంతం అన్ని విధాలా పురోగతి సాధి స్తోందన్నారు. తాండూరు - హైదరాబాద్ రహదారి అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అలీం, నాయకులు అబ్దుల్ రవూఫ్ మహిపాల్ రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, వెంకన్నగౌడ్ పాల్గొన్నారు.


మర్పల్లి: అడ్వాన్ టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మహేందర్‌రెడ్డి, అధికారులు

నూతన టెక్నాలజీతో ఉద్యోగ అవకాశాలు

మర్పల్లి: నూతన టెక్నాలజీని అందిపుచ్చుకుంటే ఆయా రంగాల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని మర్పల్లి ఏఎంసీ చైర్మన్ మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం మర్పల్లి మండల కేంద్రంలో రూ.45 కోట్ల వ్యయంతో నిర్మించిన అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్‌ను మార్కెట్ వైస్ చైర్మన్ మల్లేశ్‌యాదవ్, స్థానిక నాయకులు కృష్ణారెడ్డి, సురేశ్‌యాదవ్, రఫీ, రామేశ్వర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత స్వయం ఉపాధి రంగాల్లో స్థిరపడే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఇందులో భాగంగా టాటా కంపెనీతో ఒప్పందం కుదుర్చుకొని, టెక్నాలజీలో యువతకు 5 రకాల శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేవిధంగా చర్యలు తీసుకున్నారన్నారు. చదువుకున్న యువత ఈ టెక్నాలజీని అందిపుచ్చుకొని భవిష్యత్‌లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఐసీ జోనల్ మేనేజర్ కవిత, డిప్యూటీ జోనల్ మేనేజర్ శేషగిరిరావు, ఏటీసీ ప్రిన్సిపాల్ మహేశ్, అసిస్టెంట్ ట్రెనింగ్ అధికారి మార్కెట్ వైస్ చైర్మన్ మల్లేశ్‌యాదవ్, సహకార సంఘం వైస్ చైర్మన్ ఫసి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మల సురేశ్, బ్లాక్–2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.


స్వామివారి సన్నిధిలో హైకోర్టు జడ్జి రాజేశ్వర్‌రావు తదితరులు

అనంతుడి సేవలో హైకోర్టు జడ్జి

- పూర్ణకుంభంతో స్వాగతం పలికిన అర్చకులు

అనంతగిరి: వికారాబాద్ సమీపంలోని అనంతగిరి గుట్టపై వెలసిన శ్రీ అనంత పద్మనాభస్వామిని శనివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి, వికారాబాద్ జిల్లా పోర్ట్‌పోలియో జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు దర్శించుకున్నారు. ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చరిత్ర, దేవుని మహత్యం గురించి ప్రధాన అర్చకులు వివరించారు. తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు ఇచ్చి జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆయన వికారాబాద్ కోర్టు భవన సముదాయాన్ని సందర్శించారు. జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. జిల్లా కోర్టు ఆవరణలో మరో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు మంజూరు చేయాలని కోరారు. మంజూరైన జిల్లా కోర్టు నూతన భవనాన్ని త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి హైకోర్టు జడ్జిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్. సున్నం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శాంతిలత, పరిగి జూనియర్ సివిల్ జడ్జి ఎస్ శిల్ప, కొడంగల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీరామ్, తాండూరు జూనియర్ సివిల్ జడ్జి శివలీల, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బస్వరాజ్ పటేల్, కార్యదర్శి వెంకట్‌రెడ్డి పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమిద్దాం



భగత్‌సింగ్ సందేశ్ ర్యాలీ నిర్వహిస్తున్న డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నేతలు

- డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్

ఇబ్రహీంపట్నం: భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో అసమానతలు లేని సమాజం కోసం ఉద్యమిద్దామని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేశ్ పిలుపునిచ్చారు. భగత్ సింగ్ 118వ జయంతిని పురస్కరించుకొని ఇబ్రహీంపట్నంలో శనివారం డీవైఎఫ్ఐ అధ్వర్యంలో భగత్‌సింగ్ సందేశ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, భారత దేశ విముక్తి కోసం స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం 23 ఏళ్ల ప్రాయంలోనే ఉరి కొయ్యకు ప్రాణాలర్పించిన వీర కిషోరం భగత్‌సింగ్ అని కొనియాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భగత్‌సింగ్ ఆలోచనలకు విరుద్ధంగా మతోన్మాద విధానాలతో తినే తిండి, కట్టే బట్టపై ఆంక్షలు విధిస్తోందని ఆరోపించారు. భగత్‌సింగ్ జీవిత చరిత్రను కనుమరుగు చేసేందుకు యత్నిస్తోందని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భగత్‌సింగ్ జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.జగన్, నాయకులు జంగయ్య, రాఘవేందర్, మహేశ్, వినోద్, లింగం, తరంగ్, శ్రీకాంత్, వంశీ, శివ పాల్గొన్నారు.

సింహ వాహనంపై శ్రీవారు


సింహ వాహనంపై విహరిస్తున్న శ్రీనివాసుడు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీ వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం రాత్రి స్వామివారు సింహ వాహనంపై విహరించారు. ఉదయం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. 11 గంటలకు స్వామివారి కల్యాణం నేత్ర పర్వంగా సాగింది. శుక్రవారం రాత్రి చిన్నారుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.


కల్యాణ శోభిత స్వామి అమ్మవార్లు

బలవంతపు భూ సేకరణ వద్దు

- సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్

అనంతగిరి: రైతుల అనుమతి లేకుండా బలవంతంగా భూములు సేకరిస్తే పోరాటం తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చడం ద్వారా రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. పేదల పొలాల్లో రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రింగ్ రోడ్డు వేయడమేంటని ప్రశ్నించారు. రైతుల అభిప్రాయం తీసుకోకుండా భూములు తీసుకోవద్దని సూచించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, సత్యనారాయణ, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మంచిపేరు తెచ్చుకోవాలి

- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: ప్రజలకు అందుబాటులో ఉండటంతోపాటు, సమర్థవంతంగా విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో గ్రూప్ -1 అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. మండల కేంద్రమైన కుల్కచర్లకు చెందిన మౌనిక జిల్లా సబ్ రిజిస్టర్‌గా, తిరుమలపూర్ గ్రామానికి చెందిన మారుతి మున్సి పాల్ కమిషనర్‌గా ఎంపికయ్యారు. వారికి జాయినింగ్ లెటర్ అందజేశారు. నియోజకవర్గం నుంచి ఇద్దరు అభ్యర్థులు ఉన్నత ఉద్యోగాలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.


మౌనికకు నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

క్లుప్తంగా

గ్రూప్‌-1 ఉద్యోగిగా తాండూర్‌ ఎక్సైజ్‌ సీఐ


ఆదిశేషిరెడ్డి

తాండూరు: తాండూరు ఎక్సైజ్‌ సీఐ ఆదిశేషిరెడ్డి గ్రూప్‌-1 ఫలితాల్లో డీఎస్పీగా ఎంపికయ్యా రు. ఎక్సైజ్‌ శాఖ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఆదిశేషిరెడ్డి తాండూరు ఎక్సైజ్‌ ఇన్‌చార్జి సీఐగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మార్చిలో వెలువడిన గ్రూప్‌-1 ఫలితాల్లో ఆదిశేషిరెడ్డి ఉత్తమ ర్యాంకు సాధించడంతో పోలీసు శాఖలో డీఎస్పీగా ఎంపికయ్యారు. శనివారం శిల్పకళావేదికలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన నియామకపత్రాలు అందుకున్నారు.

ప్రభుత్వానికి నివేదిస్తాం
తహసీల్దార్‌ పురుషోత్తం


కల్‌ఖోడలో పాడైన పత్తి పంటను పరిశీలిస్తున్న అధికారులు

మర్పల్లి: పంటనష్ట పరిహారం అంచానా వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తహసీల్దార్‌ పురుషోత్తం అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని కల్‌ఖోడ, రావులపల్లి, మర్పల్లి తండాలో పాడైన పంటలను, రోడ్లను పరిశీలించారు. ఆయన వెంట ఎస్‌ఐ అబ్దుల్‌ రహూఫ్‌ ఆర్‌ఐమావరెడ్డి ఉన్నారు.

అలుగు ప్రవాహంలో కొట్టుకుపోయిన వ్యక్తి
మృతదేహం లభ్యం

బంట్వారం: అలుగు ప్రవాహంలో కొట్టుకుపోయిన ఓ వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. బంట్వా రం ఎస్‌ఐ విమల తెలి పిన ప్రకారం.. కోట్‌పల్లి మండలం కొత్తపల్లికి చెందిన చింతకింది రవికుమార్‌ (35), ప్రేమ్‌కుమార్‌ ఇద్దరూ కలిసి శుక్రవారం రాత్రి బైక్‌పై బంట్వారం మండలం సుల్తాన్‌పూర్‌కు వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా కొత్తపల్లి చెరువు అలుగు ఉధృతిలో బైక్‌ అదుపు తప్పి ఇద్దరూ కింద పడ్డారు. ఆ సమయంలో సుల్తాన్‌పూర్‌ గ్రామస్తులు చెరువు గట్టు వద్ద నుంచి గమనించి ప్రేమ్‌కుమార్‌ను కాపాడారు. రవికుమార్‌ మాత్రం అలుగు ప్రవాహంలో కొట్టుకుపోయాడు. శనివారం పోలీసులకు సమాచారం అందడంతో ఎస్‌ఐ విమల సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. కిలో మీటరు దూరంలో రవికుమార్‌ మృతదేహన్ని గుర్తించి స్థానికుల సహాయంతో బయటికి తీశారు. మృతుడు స్థానికంగా కూలీ పనులు చేస్తూ ఒంటరిగా జీవించేవాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిర్వహించి మృతదేహన్ని బంధువులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

గుట్కా అమ్మకాలపై కఠిన చర్యలు


దోమలోని కిరాణా దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

దోమ: గుట్కా అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వసంత్‌జాదవ్‌ అన్నారు. దోమ మండల కేంద్రంలోని పలు దుకాణాల్లో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుట్కా, పొగాకు తదితర పాన్‌ మసాలాలు తిని అనేకమంది కేన్సర్‌ బారిన పడి, ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. వీటిని విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జలదిగ్బంధం

ఉగ్రరూపందాల్చిన కాగ్నా
- అర్ధరాత్రి ఇళ్లలోకి చేరిన వరద
- ఓగిపూర్‌–జట్టూరు వాగులో చిక్కుకున్న లారీ డ్రైవర్లు


తాండూరు రూరల్‌: వీర్‌శెట్టిపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న సబ్‌ కలెక్టర్‌ ఉమాశంకర్‌ ప్రసాద్‌

తాండూరు రూరల్‌: మండల పరిధిలో శుక్రవారం అర్ధరాత్రి ఒక్కసారిగా వాగులు ఉగ్రరూపందాల్చడంతో వీర్‌శెట్టిపల్లి జలదిగ్బంధంలో చిక్కుకుంది. గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఇళ్లలోకి నీరు చేరి నిత్యావసర సరుకులు పాడయ్యాయి. విద్యుత్‌ సరఫరా నిలిచి చీకటికమ్ముకుంది. విషయం తెలుసుకున్న తాండూరు సబ్‌ కలెక్టర్‌ విశ్వప్రసాద్‌, తహసీల్దార్‌ తారాసింగ్‌, యాలాల ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, ఆర్‌ఐ గోపి శనివారం గ్రామస్తులకు ధైర్యం చెప్పారు. సాయంత్రానికి ఉధృతి తగ్గి రాకపోకలు కొనసాగాయి.

లారీ డ్రైవర్లను కాపాడిన ఎస్‌డీఆర్‌ఎఫ్‌ బృందం

మండల పరిధిలోని ఓగిపూర్‌ సమీపంలో సాగర్‌ సిమెంట్‌ ఫ్యాక్టరీకి వెళ్లిన లారీ డ్రైవర్లు జట్టూరు వాగులో చిక్కుకున్నారు. కర్ణాటక రాష్ట్రం చంద్రపల్లి డ్యాం ఒక్కసారిగా నీటిని విడుదల చేయడంతో జట్టూరువాగు వద్ద లారీలు వరదలో చిక్కుకున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ముజావీర్‌, జార్ఖండ్‌కు చెందిన బుద్దిరామ్‌ లారీల్లో ఇరుక్కుకుని కంపెనీ ప్రతినిధులకు సమాచారం ఇచ్చారు. వారు కరన్‌కోట్‌ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు మహబూబ్‌నగర్‌కు చెందిన ఎస్‌డీఆర్‌ఎఫ్‌ బృందం సాయంతో పడవలో వెళ్లి డ్రైవర్లను కాపాడారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, తహసీల్దార్‌ తారాసింగ్‌, రూరల్‌ సీఐ నగేష్‌, ఎస్‌ఐ రాథోడ్‌ వినోద్‌ పర్యవేక్షించారు.

సంగెంకలాన్‌ ఎస్సీకాలనీలోకి చేరిన వరద

సంగెంకలాన్‌ చుట్టూ వాగులు పొంగిపొర్లి ఎస్సీ కాలనీలోని ఇళ్లల్లోకి వరద చేరింది. దీంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బోంకూర్‌ గ్రామం చుట్టూ నీరు చేరి గ్రామస్తులు ఆందోళన చెందారు.


తాండూరు రూరల్‌: సంగెంకలాన్‌లోని ఎస్సీ కాలనీలో ఇళ్లలోకి చేరిన వరద

మునిగిన సబ్‌స్టేషన్‌..

మండలంలోని గౌతపూర్‌ విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ నీట మునిగింది. దీంతో విద్యుత్‌ సరఫరా నిలిపివేశారు. ఆయా గ్రామాలకు తాండూరు సబ్‌స్టేషన్‌ నుంచి విద్యుత్‌ సరఫరా కొనసాగించారు.

నీట మునిగిన పంటలు


రాంనాథ్‌గుడుపల్లిలో పాడయిన పత్తి పంట

మోమిన్‌పేట: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు పూర్తిగా పాడయ్యాయి. వాగులు, వంకలు పొంగిపొర్లి రోడ్లు ధ్వంసమయ్యాయి. నందివాగు పరివాహక ప్రాంతంలోని పంటలు నీట మునిగాయి. రావుల, కోల్కుంద, గోవిందాపూర్‌, రాళ్లగుడుపల్లి, కాస్లబాదు, మేకవనంపల్లి, మల్లారెడ్డిగూడెం, రాంనాథ్‌గుడుపల్లి గ్రామాలని పెద్దవాగు పరివాహక ప్రాంతంలోని పంటలకు పూర్తి నష్టం వాటిల్లింది. దుర్గంచెర్వు అలుగు ఉధ్రుతికి రోడ్డు గుంతలమయమైంది. టేకులపల్లిలో ఇళ్లలోకి వరద చేరి ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

దంచి కొట్టిన వాన.. జనం హైరానా

జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనం బెంబేలెత్తుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వానలకు 27 ఏళ్ల క్రితం అలుగుపారిన చెరువులు మళ్లీ మత్తడి దుంకుతున్నాయి. ప్రధాన ప్రాజెక్టులు, చెరువులు అలుగు పారుతున్నాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. పలు చోట్ల రాకపోకలు నిలిచిపోగా.. వరద కారణంగా పంటలన్నీ నీట మునిగాయి. సబ్‌స్టేషన్లకు నీరు చేరి విద్యుత్‌ సరఫరా నిలిపివేశారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని పంట నష్టపోయిన రైతులు అధికారులను వేడుకున్నారు. – సాక్షి, నెట్‌వర్క్‌

రోడ్లు ధ్వంసం


పెండ్లిమడుగు రోడ్డుపై కుంగిన కల్వర్టు

అనంతగిరి: వికారాబాద్‌ పట్టణం, మండల పరిధిలో రెండు రోజులుగా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో పంటలు నీట మునిగాయి. పలు చోట్ల వాగులు ఉధృతంగా ప్రవహించాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పెండ్లిమడుగు–మూలమాడ ప్రధాన రోడ్డుపై కల్వర్టు వద్ద రోడ్డు ఓ వైపు దెబ్బతింది. ప్రభుత్వం స్పందించిన రైతులకు నష్ట పరిహారం అందించాలని కోరుతున్నారు.

కల్వర్టుకు తాత్కాలిక మరమ్మతు

కొడంగల్‌ రూరల్‌: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి చిట్లపలి–ఖాజా అహ్మద్‌పల్లి వాగు పొంగి ప్రవహిస్తోంది. అన్నారం–నాగారం వెళ్లే దారిలో తెగిన కల్వర్టుకు తహసీల్దార్‌ దీపక్‌ శ్యామ్‌దస్‌దాస్‌ ఆదేశాల మేరకు పంచాయతీ రాజ్‌ ఏఈ రవికిరణ్‌ తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు. శనివారం ఉదయం ఆయా ప్రాంతాలను తహసీల్దార్‌ దీపక్‌ శ్యామ్‌దస్‌దాస్‌, ఆర్‌ఐ రాఘవేందర్‌, రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. మండల పరిధిలోని పర్సాపూర్‌లో కల్వర్టు మూసుకుపోవడంతో ఇబ్బందిపడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్‌ సయ్యద్‌ అంజద్‌ కోరారు.

ఆయకట్టు పంటలకు నష్టం

నీట మునిగిన పత్తి, వరి
- పాడైన రోడ్లు


రావులపల్లిలో నీట మునిగిన పత్తి పంట

మర్పల్లి: మండల పరిధిలో శుక్రవారం రాత్రి కురిసిన అతి భారీ వర్షంతో పంటలు పాడయ్యాయి. పత్తి, పసుపు, మొక్కజొన్న, కూరగాయ పంటలు నీట మునిగాయి. రావులపల్లి, కల్‌ఖోడ ఆర్‌అండ్‌బీ రోడ్డు, మర్పల్లి నుంచి తండాకు వెళ్లేందుకు వేసిన రోడ్లు తెగిపోయాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజల రాకపోకలు స్తంభించాయి. రావులపల్లి చెరువు కింద కుడి, ఎడమ కాల్వల ఆయకట్టులో 200 ఎకరాల వరకు పంటలు కోతకు గురయ్యాయి. దీంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు ప్రభుత్వంకు విజ్ఞప్తి చేశారు. కల్‌ఖోడ గ్రామంలో ఓరైతు ఇల్లు వర్షానికి కూలింది. పలు ఇండ్లలో నీరు చేరి జాగరణ చేశారు. తెలుసుకున్న తహసీల్దార్‌ పురుషోత్తం, ఎస్‌ఐ రవూఫ్‌, అధికారులు కల్‌ఖోడ, రావులపల్లి గ్రామాలలో పంటలను పరిశీలించారు. ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. కోతకు గురైన రోడ్లను, పంటలను పరిశీలించి పరిహారం అందేవిదంగా ప్రభుత్వంకు నివేదికలు పంపుతామన్నారు.

ఎకరాకు రూ.25వేలు: మెతుకు ఆనంద్‌

విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్‌ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌ పార్టీ నాయకులతో కలిసి పాడైన పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పాడైన పంటలకు తక్షణ సాయంగా రైతులకు ఎకరాకు రూ.25వేల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. రోడ్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌ రెడ్డి, మాజీ వైస్‌ ఎంపీపీ మోహన్‌రెడ్డి రైతులు ఉన్నారు.


పాడైన పంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌ తదితరులు

కూలిన ఇల్లు

కొడంగల్‌ రూరల్‌ : పట్టణంలోని మిట్టిబౌలి సమీపంలో ఓ ఇల్లు వర్షం కారణంగా శనివారం తెల్లవారుజామున కూలింది. ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని అబ్దుల్‌ కరీంకు వాపోయాడు. అధికారులు ఆర్థిక సహాయం అందించాలని బాధితులు కోరుతున్నారు.

చేపల వేట

మండలంలోని పలు చెరువులు అలుగు పారుతున్నాయి. అలుగు కింది భాగంలో, కల్వర్టుల సమీపంలో చేపలు పడుతూ ఉత్సాహంగా గడుపుతున్నారు. పర్సాపూర్‌, కొడంగల్‌ పెద్ద చెరువు అలుగు పారుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాకపోకలకు బ్రేక్‌

దుర్గామాత పూజకు ట్రాక్టర్‌లో వాగుదాటించిన పాలేపల్లి వాసులు

దోమ: రెండు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. శనివారం గొడుగునిపల్లి వాగు ఉధృతికి పరిగి–మహబూబ్‌నగర్‌ మార్గంలో రాకపోకలు నిలిచాయి. పాలేపల్లి వాగు ఉప్పొంగి ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయాయి. దుర్గామాత పూజకోసం పూజారి ట్రాక్టర్‌ సాయంతో వాగుదాటించారు. బ్రహ్మణపల్లి వాగు సైతం హైలెవల్‌ వంతెనపై పారుతూ జనజీవనం స్తంభించింది.

27 ఏళ్లకు అలుగు పారిన అయినప్పుడు చెరువు

మండల పరిధిలోని అయినప్పుడు గ్రామ పెద్ద చెరువు 27 ఏళ్ల తర్వాత మత్తడి దూకింది. సుమారు 600 ఎకరాల ఆయకట్టు ఉండగా రైతులు సంతోషం వ్యక్తం చేశారు. దాదాపు 200 ఎకరాల పంట పొలాలు నీటి పాలయ్యాయి.


గొడుగోనిపల్లిలో శిథిలాల నుంచి బైక్‌ తీస్తున్న బాధితుడు

గొడుగోనిపల్లిలో బి.రాములమ్మ ఇంటి గోడ కూలి తిమ్మని సత్తయ్య బైక్‌ పడింది. దీంతో ద్విచక్రవాహనం పూర్తిగా ధ్వంసమైంది.

ముంచిన మూసీ

నవాబుపేట: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలం మీదగా 20 కిలో మీటర్లు ప్రవహించే మూసీ నది వందల ఎకరాల్లో పంటలను నిండా ముంచిది. నదికి ఇరు వైపులా ఉన్న పంటల్లో నుంచి రెండు రోజులుగా వరద ప్రవహిస్తోంది. దీంతో మండలంలోని చించల్‌పేట, చిట్టిగిద్ద, అక్నాపూర్‌, పులుమామిడి, లింగంపల్లి, నారెగూడ, గంగ్యాడ, ముబారక్‌పూపూర్‌, తదితర గ్రామాల్లో రైతుల పంటలు పాడయ్యాయి. అధికారులు స్పందించి పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు.


గంగ్యాడ వద్ద ఉధృతంగా ప్రవాహం

తెగిన బ్రిడ్జి.. కూలిన ఇళ్లు

యాలాల: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నదులు, వాగులు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. కాగ్నా ఉధృతికి మండలంలోని కోకట్‌ కాగ్నా బ్రిడ్జి తెగింది. దీంతో తాండూరు–రాస్నం, ముద్దాయిపేట మీదుగా పరిగి, హైదరాబాద్‌ ప్రాంతాలకు రాకపోకలు నిలిచాయి. శివసాగర్‌, జుంటుపల్లి ప్రాజెక్టులు అలుగులు పారాయి. బెన్నూరుకు చెందిన తిమ్మయ్య, రాస్నంకు చెందిన మల్లేషం ఇళ్లు కూలాయి.

కోకట్‌ బ్రిడ్జిని పరిశీలించిన కలెక్టర్‌, ఎమ్మెల్యే

వరద ఉధృతికి తెగిన కోకట్‌ కాగ్నా బ్రిడ్జిని కలెక్టర్‌ ప్రతీక్‌ జైన్‌, ఎస్పీ నారాయణరెడ్డి, సబ్‌ కలెక్టర్‌ ఉమాశంకర్‌ ప్రసాద్‌, తహసీల్దార్‌ వెంకటస్వామి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు పరిశీలించారు. ఈ మార్గంలో రాకపోకలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. యుద్ధ ప్రాతిపదికన బ్రిడ్జికి మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు.


వరద ఉధృతికి తెగిన కోకట్‌ కాగ్నాబ్రిడ్జి

'కాగ్నా' కన్నెర్ర

- గోశాలను ముంచెత్తిన వరద
- 50కిపైగా మూగజీవాలు మృత్యువాత

బషీరాబాద్‌: భారీ వర్షాలకు బషీరాబాద్‌ మండలం అతలాకుతలమైంది. జీవన్గీ వద్ద కాగ్నా నది ఉగ్రరూపం దాల్చింది. వాగు ఒడ్డున ఉన్న ఓ గోశాలను ముంచెత్తడంతో శుక్రవారం తెల్లవారుజామున అందులోని 146 ఆవులు, ఎద్దులు, దూడలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వీటిలో యాభై వరకు ఈదుతూ ఒడ్డుకు చేరుకోగా, తాళ్లతో కట్టేసినవి కొన్ని గోశాలలో చిక్కుకున్నాయి. మిగిలినవి వరద ఉధృతిలో కొట్టుకుపోయాయి. శనివారం మధ్యాహ్నం కర్ణాటక రాష్ట్రం చించొలి నుంచి వచ్చిన తొమ్మిది మంది, వికారాబాద్‌ జిల్లాకు చెందిన మరో పది మంది ఎన్డీఆర్‌ఎఫ్‌ బృందం సభ్యులు గోశాలకు చేరుకున్నారు. తలలు పైకెత్తి నీటిలో మునిగి ఉన్న సుమారు నలభై పశువుల తాళ్లను కోసేయడంతో ఒడ్డుకు చేరుకున్నాయి. మిగిలిన సుమారు 56 ఆవులు, కోడెలు, దూడలు వరద ఉధృతిలో కొట్టుకుపోయాయి. మహబూబ్‌నగర్‌ మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఈ గోశాలను నిర్వహిస్తున్నట్లు తెలిసింది. స్థానిక ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి అక్కడికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. కలెక్టర్‌ ప్రతీక్‌జైన్‌, ఎస్పీ నారాయణరెడ్డి యంత్రాంగంతో కలిసి సహాయక చర్యల్లో పాల్గొన్నారు.


వరద ఉధృతిలో చిక్కుకున్న గోశాల


సహాయక చర్యలు చేపడుతున్న ఎన్డీఆర్‌ఎఫ్‌ బృందం

ఆగం చేసిన కోట్‌పల్లి వరద

రాంపూర్‌తండా, గట్టేపల్లి రైతులను ముంచిన కోట్‌పల్లి అలుగునీరు

- వాగులో కొట్టుకుపోయిన నాలుగు గేదెలు వాటి దూడెలు
- 30 విద్యుత్‌ స్తంభాలు, నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

ధారూరు: రాంపూర్‌తండాలో సాగుచేసిన కంది, వరి పంటలను కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగునీరు తూడ్చిపెట్టిందని రైతులు శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. తండాకు చెందిన బుజ్జిబాయి, రుక్కిబాయి, మున్యానాయక్‌లు సాగుచేసిన వరి, కంది పంట పొలాలు నీటిలో కొట్టుకుపోయాయి. వాగు పక్క నుంచి వేసిన విద్యుత్‌ లైన్‌లో దాదాపు 30 స్తంభాలు నేలకొరిగాయి. మూడు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. ఓ ట్రాన్స్‌ఫార్మర్‌ కొట్టుకుపోయింది.

వీధినపడ్డ రైతు తార్యానాయక్‌

వాగు పక్కనే ఉన్న పొలంలో కుటుంబంతో ఉంటున్న తార్యానాయక్‌ పాడి పరిశ్రమ కొనసాగిస్తున్నారు. పొలంలో నిర్మించుకున్న ఇంట్లో నిద్రించగా శనివారం తెల్లవారుజామున వాగు ఉధృతంగా ప్రవహించి పాకలో కట్టేసిన నాలుగు గేదెలను, వాటి దూడెలు నీటి ప్రవాహంలో కలిసిపోయాయి. ఎంత వెతికినా వాటి కళేబరాలు కూడా దొరకలేదని కన్నీటి పర్యంతమయ్యాడు. ఇంట్లోకి వరద చేరి సామగ్రి కొట్టుకుపోయింది. నాలుగు ఎకరాల వరిపై ఇసుక మేట వేసింది. నిద్రలోంచి మేల్కన్న తార్యానాయక్‌ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని తండ్రి, భార్యా, ముగ్గురు పిల్లల్ని ఇంట్లోంచి తీసుకెళ్లి ప్రాణాలు దక్కించుకున్నారు. గేదెలు, వాటి దూడలకు రూ. 5 లక్షల విలువ ఉంటుందని, వరి పొలం, ఇంటి సామాగ్రి కలిపి రూ.2 లక్షలు, మొత్తం రూ.7 లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరాడు. వరుస వర్షాల కారణంగా కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగునీరు వాగు ప్రవహిస్తుండడంతో పంటలు పాడయ్యాయి. వాగుకు ఇరువైపులా 600 మీటర్ల వరకు కంది, పత్తి, వరి పంటలు నేలమట్టమయ్యాయి. మండలంలోని గట్టెపల్లి గ్రామంలోనే 30 ఎకరాలు పత్తి, పది ఎకరాల కంది, 25 ఎకరాల్లో వరి పాడైంది. కౌలు రైతు నర్సింహ 1.70లక్షలతో 15 ఎకరాల్లో కౌలు పంటలన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. రుద్రారం, అల్లాపూర్‌, నాగసమందర్‌ గ్రామాల్లో దాదాపు 42 ఎకరాల్లో కంది, వరి, పత్తి పంటలు నీటిలో కొట్టుకపోయాయని రైతులు వాపోయారు. వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పాడైన పంట పంట పొలాలను పరిశీలించి పరిహారం అందిచాలని రైతులు కోరుతున్నారు.

కూలిన కేరెళ్లి సొసైటీ భవనం

నిరంతరంగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని కేరెళ్లి సొసైటి భవనం శనివారం కూలింది. భవనం వెనుక బాగంలో కూలడం, దాని పక్కనే ఉన్న అంగన్‌వాడీ భవనంలో ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. శనివారం సాయంత్రం ధారూరు పీఏసీఎస్‌ చైర్మన్‌ సత్యానారాయణరెడ్డి, సీఈఓ కె.నర్సింలు సంఘటన స్థలాన్ని సందర్శించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. కూలిన భవనాన్ని వెంటనే డిస్మెటల్‌ చేయించాలని గ్రామస్తులు కోరారు.


ధారూరు: రాంపూర్‌తండాలో తార్యానాయక్‌ ఇంట్లోకి చేరిన వరద



ధారూరు: అర్ధరాత్రి ఇంట్లోకి వాగునీటి ప్రవాహం చేరడంతో ప్రాణాలతో బయటపడ్డ తార్యానాయక్‌ కుంటుంబం

చివరి మజిలీకి చిక్కులు

- అంత్యక్రియలు చేయాలంటే వాగు దాటాల్సిందే
- వరద నీటి నుంచే ట్రాక్టర్‌లో మృతదేహాన్ని తరలించిన గ్రామస్తులు
- పాలకులు సమస్య పరిష్కరించాలని డిమాండ్‌

మర్పల్లి: మండల పరిధిలోని సిరిపురంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు రెండు దశాబ్దాలుగా ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో గ్రామస్తులు ఎవరైనా చనిపోతే వీరన్న వాగు మీదుగానే శ్మశాన వాటికకు వెళ్లాలి. ఇక్కడ వంతెన నిర్మించాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా పట్టించుకునే వారే కరువయ్యారు. శుక్రవారం రాత్రి గ్రామానికి చెందిన నిమ్మగల పెంటమ్మ(65) అనారోగ్యంతో మృతి చెందింది. శనివారం చితిపేర్చేందుకు వాగులో పారుతున్న వరద నుంచే ట్రాక్టర్‌లో కట్టెలు తీసుకెళ్లారు. ఎంతకూ వరద ఉధృతి తగ్గకపోవడంతో ట్రాక్టర్‌లో మృతదేహం ఉంచి వాగు మీదుగా తీసుకెళ్లారు. ఈ క్రమంలో ట్రాక్టర్‌ వరదలో చిక్కుకోవడంతో గ్రామస్తులంతా కలిసి నెట్టుకుంటూ వాగు దాటించి అంత్యక్రియలు నిర్వహించారు. ఇప్పటికైనా పాలకు స్పందించి వీరన్నవాగుపై వంతెన నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


మృతదేహం ట్రాక్టర్‌లో ఉంచి వాగు దాటిస్తున్న సిరిపురం గ్రామస్తులు